క్లుప్తంగా

నేడు సమతా త్రిమూర్తుల జయంత్యుత్సవాలు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్వర్గీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాలను సమతా త్రిమూర్తులు పేరుతో నిర్వహించనున్నట్లు వేదిక నిర్వాహకులు తెలిపారు.

సామర్లకోట పీఎస్ పరిధిలోకి 14 గ్రామాలు

కాకినాడ క్రైం: సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి 14 గ్రామాలను విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రాష్ట్ర డీజీపీ కార్యాలయం తాజా ఉత్తర్వుల్లో వెల్లడించింది. కాకినాడ గ్రామీణం మండలం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన 4 గ్రామాలు, తిమ్మాపురం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 10 గ్రామాల శాంతిభద్రతలు ఇకపై సామర్లకోట పీఎస్ పరిధికి చెందనున్నాయి. ఇంద్రపాలెం పీఎస్ పరిధికి చెందిన మాధవపట్నం, వెంకటరాయపురం, బోయినపాడు, మామిళ్లదొడ్డి గ్రామాలతో పాటు తిమ్మాపురం పరిధికి చెందిన అచ్చంపేట, గొంచాల, పనసపాడు, నవర, పవర, ఉండూరు, పి.వేమవరం, కొప్పవరం, వల్లూరు, సీతారామపురం గ్రామాలు సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి విలీనం అయ్యాయి. సంబంధిత గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు.

సర్వలోక రక్షకుడు క్రీస్తు



బైక్ ర్యాలీలో పాల్గొన్న మండల పాస్టర్లు

కరప: సర్వలోక రక్షకుడు ఏసుప్రభువని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు పేర్కొన్నారు. గొర్రిపూడిలోని పాస్టర్ రెవరెండ్ ఆర్.ప్రతాప్ చర్చి వద్ద శనివారం రన్ ఫర్ జీసస్, మోటార్‌బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి కరప వరకు నిర్వహించారు. అనంతరం గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా జీవించాలని ప్రార్థనలు చేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ కన్వీనర్ పి.సత్యప్రసాద్‌బాబు, సెక్రటరీ కె.ఆనంద్‌బాబు, చైర్మన్ డాక్టర్ పి.సామ్యూల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ జె.పాల్‌ప్రసాద్, జాయింట్ సెక్రటరీ డి.ఏసురత్నం, జిల్లా జాయింట్ సెక్రటరీ ఐ.జాన్‌సూర్యప్రకాష్, డాక్టర్ స్టీఫెన్‌బాబు, వీవీ ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయ ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, వందలాది మంది భక్తుల నడుమ ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. వేద పండితులు యనమండ్ర శర్మ, చిట్టి శివ ఘనపాఠి, రమేష్ ఘనపాఠి, అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు, ఏఈఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

సామర్లకోట: స్థానిక టీటీడీసీలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం సాయంత్రం డీఈఓ ఎస్‌వీఎస్ అన్నపూర్ణ పరిశీలించారు. యూనిఫాం కుట్టు చార్జీలు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండేందుకు టీటీడీసీలో కుట్టు శిక్షణ కేంద్రంలో విద్యార్థుల దుస్తులు కుట్టించాలని భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కూడా ఈ కుట్టు శిక్షణ కేంద్రానికి ఇచ్చి కేంద్రం అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ యోచిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఈ మేరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు.

సమస్యలను ప్రజలకు వివరిస్తాం

కాకినాడ సిటీ: తమ సమస్యలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పితాని త్రినాథరావు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక రెవెన్యూ భవన్‌లో వివిధ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్క్ టు రూల్ కచ్చితంగా పాటించాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్‌ఎస్‌ఆర్‌కే దుర్గాప్రసాద్ కార్యాచరణ వివరాలను చదివి వినిపించారు. రాష్ట్ర కమిటీ కో చైర్మన్, రాష్ట్ర డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంసాని శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటికి ఢోకా లేదు

- సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం
- వేసవి జలాశయాల్లో సమృద్ధిగా నీరు
- ఆ మేరకు ఏర్పాట్లు చేసిన కార్పొరేషన్



కాకినాడ విక్టోరియా వాటర్ వర్క్స్

కాకినాడ: ఎండాకాలంలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా కాకినాడ నగరపాలక సంస్థ వేసవి కార్యాచరణను సిద్ధం చేసింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచీ ముందస్తు ప్రణాళికలతో సమాయత్తమైంది. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా కాకినాడ నగర ప్రజలకు రెండుపూటలా సమృద్ధిగా నీరందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు వాటర్‌వర్క్స్ అధికారులతో సమావేశమై వేసవి కార్యాచరణలో భాగంగా తీసుకోవలసిన చర్యలను సిద్ధం చేశారు.

జలాశయాలను నింపే దిశగా...

మరమ్మతుల దృష్ట్యా గోదావరి కెనాల్‌ను ఏప్రిల్ 15వ తేదీ తరువాత మూసివేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాకినాడ ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉండేందుకు అందుబాటులో ఉన్న రెండు జలాశయాలలో నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసేందుకు చర్యలు వేగవంతం చేశారు. అరట్లకట్టలో 1,582 మిలియన్ లీటర్లు (ఎంఎల్), సాంబమూర్తి రిజర్వాయర్‌లో 821 ఎంఎల్ నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ఆ మేరకు వేసవి జలాశయాలను నింపగలిగితే జూన్‌లో కాలువలు తెరిచే వరకు 45 రోజులపాటు ప్రజలకు పూర్తిస్థాయిలో నీరందించగలమని వాటర్‌వర్క్స్ అధికారులు చెబుతున్నారు.

పెరిగిన సామర్థ్యం

దాదాపు 120 ఎకరాల్లో విస్తరించిన అరట్లకట్ట వేసవి జలాశయంలో చాలాకాలంగా ఉన్న పూడికను కూడా ఇటీవల తొలగించడంతో అక్కడ నీటి నిల్వ సామర్థ్యం మరింత పెరిగిందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల మరో వారం నుంచి పది రోజులపాటు ప్రజలకు అదనంగా నీరందించగలిగే సామర్థ్యం ఉంటుందని చెబుతున్నారు. అందువల్ల కాలువలు తెరవడంలో కొంత జాప్యం జరిగినా ఈసారి మంచినీటికి ఎటువంటి ఢోకా ఉండదంటున్నారు.

అదనపు ఏర్పాట్లు

నగర శివార్లను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నీటి ఒత్తిడి లేకపోతే వచ్చే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అదనపు ట్యాంకర్లను కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థకు ఐదు మంచినీటి ట్యాంకర్లు ఉండగా అవసరానికి అనుగుణంగా అద్దె ట్యాంకర్లను కూడా ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. ఆ మేరకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

వేసవి తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ యోచిస్తోంది. రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు, ముఖ్యప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ గతంలోలా చల్లని నీరును అందించడం ద్వారా ప్రజల దాహార్తిని తీర్చేలా చర్యలు తీసుకోనున్నారు. మొత్తంమీద వేసవిలో ప్రజలు మంచినీటి కోసం ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం



వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ముఖ్యంగా వేసవి జలాశయాలలో సామర్థ్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో నీటిని నింపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు 45 రోజులపాటు పూర్తిస్థాయిలో నీరందించే సామర్థ్యం రెండు వేసవి జలాశయాలకు ఉంది. అందువల్ల వచ్చే వేసవిలో మంచినీటికి ఎటువంటి కొరత లేకుండా చూస్తాం.

– ఎం.వెంకట్రావు, ఇన్‌చార్జి ఎస్‌ఈ, కాకినాడ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిత

- ఐటీ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భవిష్యత్‌లో అన్ని సెక్టార్లలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కీలకం కాబోతోందని ఐటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కాకినాడ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ అంశంపై సదస్సు నిర్వహించారు. ఐటీ సంస్థలన్నీ ఏకతాటిపై ఉండి కొత్త సాంకేతికతపై అవగాహనతో పాటు ఎనలిటిక్స్‌లో కొత్త పరిణామాలు, తాజా పోకడలపై ఎంఎన్‌సీ సంస్థలు టెక్ మహీంద్ర, క్యాప్ జెమినీ వంటివి విశ్లేషించాయి. రాష్ట్రంలో వైజాగ్ ఐటీ చాప్టర్ తరువాత ప్రధాన పాత్ర పోషించే దిశగా కాకినాడ చాప్టర్ అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం 40 సంస్థలు ఈ చాప్టర్‌లో ఉన్నాయన్నారు. వైజాగ్ సమ్మిట్ తరువాత ఐటీ కంపెనీలు మరింత చురుగ్గా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని కృష్ణారెడ్డి తెలిపారు. ఐటీఏపీపీ అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు ఐటీ నిపుణులు జె.కుమార్, లక్ష్మి, ఆర్‌ఎల్ నారాయణలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 140 మంది ఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- వసతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి
- సెంట్రల్ లేఅవుట్‌లో ఎమ్మెల్యే కురసాల పరిశీలన

కరప: స్థానిక సెంట్రల్ లే అవుట్‌లోని లబ్ధిదారులను చైతన్యపరచి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధికారులను ఆదేశించారు. కరపలో 130 ఎకరాల్లో సెంట్రల్ లేఅవుట్ చేసి, అందరికీ ఇళ్లు పథకంలో ఐదువేల మందికిపైగా ఇళ్లస్థలాల పట్టాలిచ్చారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన విద్యుత్, బోరు వంటి సౌకర్యాలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. సిమెంట్, ఐరన్ ఇస్తున్నట్టు లబ్ధిదారులకు వివరించాలని ఎమ్మెల్యే అన్నారు. తర్వాత సీతమ్మవీధిలో నిర్మాణంలో ఉన్న బీసీ కళ్యాణమండపం పనులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, కరప, వలసపాకల సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి రామారావు, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, గోపిశెట్టి బాబ్జీ, మద్దూరి భాస్కర్, మేడిశెట్టి సత్తిబాబు, చొల్లంగి దుర్గారావు, కొత్త రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుమర్తిలో జగనన్నే మా భవిష్యత్తు



వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



పెనుమర్తిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పెనుమర్తిలో గడప గడపకూ..

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులతో కలసి ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ పథకాలు, సీఎం పనితీరు, తదితర వాటిని వివరించి, ప్రజల నుంచి వివరాలు సేకరించారు. కురసాల సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, పెంకే ఆనంద్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం.. ఆశీర్వదించండి

కాకినాడ రూరల్: ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన మాట నిలుపుకొన్నాం.. నవరత్నాలు పథకాల ద్వారా హామీలు నెరవేర్చాం సీఎం జగన్ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా కాకినాడ రూరల్ పెనుమర్తిలో శనివారం అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామస్తులు రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయం వంటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికీ నేరుగా లబ్ధిని అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. అనంతరం గ్రామంలో ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సర్పంచ్ పెంకే ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ కొల్లా బాస్కర్, వెల్లంకి సత్యవతి, రమేష్, పలివెల గోవిందరాజు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీను, పండూరు ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, సొసైటీ అధ్యకుడు సత్తిబాబు, ధర్మరాజు, నందూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు



కిట్ల పంపిణీ ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

కరప: పాఠశాల విద్యార్థులకు ఇచ్చే జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లు సక్రమంగా పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జేవీకే పర్యవేక్షకురాలు, ఆర్‌జేడీ జి.నాగమణి సూచించారు. మండల పర్యటనలో భాగంగా శనివారం ఆమె కరప హైస్కూలును సందర్శించి, జేవీకే కిట్లను ఉంచేందుకు మండల స్టాక్‌పాయింట్‌గా హైస్కూలు అనువుగా ఉంటుందో లేదో పరిశీలించి, ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. కిట్ల క్వాలిటీ కమిటీగా ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, మండల ఇంజినీరింగ్ అధికారి శైలజ, డిస్ట్రిబ్యూషన్ కమిటీగా ఎంఈఓ బుల్లికృష్ణవేణి, స్టాక్ పాయింట్ హెచ్‌ఎం యు.లీలామనోహర్ ఉంటారని ఆర్‌జేడీ తెలిపారు. జీహెచ్‌ఎంలు బీవీఎస్ ప్రసాద్, ఎస్‌టీవీ రాణాప్రతాప్, యు.లీలామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమ బలోపేతానికి కృషి



'వారెవ్వా జతగాళ్లు' సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న మోహన్‌గౌడ్ తదితరులు

- ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి మోహన్‌గౌడ్

కాకినాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్రపరిశ్రమను హైదారాబాద్‌కు సమాతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి జేవీ మోహన్‌గౌడ్ అన్నారు. స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లోని తహసీల్దార్ కార్యాలయం సమావేశపు మందిరంలో చిత్ర పరిశ్రమ అవగాహన సదస్సు చాంబర్ జిల్లా కో ఆర్డినేటర్ పీడీఆర్ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగింది. రాష్ట్రంలో చిత్రపరిశ్రమను బలోపేతం చేసే బాధ్యత మనందరిపై ఉందని మోహన్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో సినిమా చిత్రీకరణకు అనువైన ఎన్నో లోకేషన్లు ఉన్నాయని అన్నారు. అలాగే స్థానిక సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆంధ్రలో సినిమా చిత్రీకరిస్తే సబ్సిడీ ఉంటుందన్న విషయంపై సదస్సులో అవగాహన కల్పించారు. చాంబర్ జిల్లా కో ఆర్డినేటర్ పీడీఆర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణలకు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం తూర్పుగోదావరి ప్రాంతంలో చిత్రీకరించిన 'వారెవ్వా జతగాళ్లు' సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించి, సినిమా యూనిట్‌ను సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ మంతా శ్రీనివాస్, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ పిచ్చిరెడ్డి, నాగరాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయంగా అంబేడ్కర్ భవన్

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- తిమ్మాపురం, కరపలలో ఎంపీ గీతతో కలిసి నిర్మాణాలకు శంకుస్థాపన



కరపలో భవన నిర్మాణానికి బౌద్ధ సంప్రదాయంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత

కాకినాడ రూరల్/కరప: జీవితంలో గుర్తుండిపోయేలా అంబేడ్కర్ భవన్ నిర్మాణాలు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. తిమ్మాపురం పంచాయతీ అచ్చంపేట జంక్షన్‌కు సమీపంలో రూ.70 లక్షలతో, కరపలోని అంబేడ్కర్ నగర్–1లో రూ.కోటితో నిర్మించనున్న ఈ భవనాలకు ఎంపీ వంగా గీతతో కలసి శనివారం శంకుస్థాపన చేశారు. తిమ్మాపురంలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ సమకూర్చిన సుమారు రూ.3 కోట్ల విలువైన స్థలంలో, కరపలో 30 సెంట్ల భూమిని కేటాయించి ఈ భవనాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. నాలుగు నెలల్లో వీటిని పూర్తిచేయాలని సూచించారు. ఎంపీ గీత మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా సీఎం జగన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, ఈ చక్కని నిర్మాణాలకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు అభినందనీయమన్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్‌కు 1250 గజాల స్థలం కేటాయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ సెల్ సభ్యుడు ఎం.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఈ భవనాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కరపలో మండల అంబేడ్కర్ బౌద్ధ వివాహకర్త, బౌద్ధ ఉపాసకులు గిడ్ల వీరప్రసాద్ బౌద్ధసంప్రదాయంలో భవననిర్మాణానికి భూమిపూజ జరిపించారు. స్థలం సమకూర్చిన సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్‌కుమార్, నిధులు మంజూరుచేసిన ఎమ్మెల్యే కన్నబాబులకు మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, గోపుశెట్టి బాబ్జీ, వైస్ ఎంపీపీ బందిలి విరీష, మండల ఎస్సీ సెల్ నాయకుడు ధనరాజ్, జంగా గగారిన్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజనల్ విభాగం సమన్వయకర్త జమ్మలమడక నాగమణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, ఎంపీటీసీ ముద్దన వెంకట్రాజు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, కరప మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, దళిత రచయిత, బుద్దిస్ట్ సవిలే రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, మండల అంబేడ్కర్ యువజన సేవాసంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీవ్ డోర్ కార్మికులకు వేతనాల పెంపు

కాకినాడ సిటీ: కాకినాడ యాంకరేజ్ పోర్టు, డీప్ వాటర్‌పోర్టుల్లో పని చేసే స్టీవ్ డోర్ కార్మికులకు వేతనాలు పెంచినట్టు ఆ సిబ్బంది, కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి పితాని నూకరాజు తెలిపారు. శనివారం పోర్టులో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పెరిగిన వేతనాలు ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ట్రేడ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందం కుదిరిందన్నారు. కార్మికుల తరఫున తనతో పాటు నాయకులు చిన్ని భావనారాయణ, సుర్ల రాఘవేంద్రరావు, బొందు శివాసి, వరిపిల్లి బలరామ్, ఎస్‌కె బషీర్ తదితరులు పాల్గొనగా యాజమానుల తరఫున గాదం చంద్రశేఖర్, పీవీ రావు, అన్నవరపు వెంకటాచలం, ఎంఎస్ కుమార్, ఎం.సాయిరామ్ తదితరులు చర్చించినట్లు తెలిపారు. వేతనాల పెరుగుదలకు సహకరించిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్రారెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి సంవత్సరం మేస్త్రీలకు, సూపర్‌వైజర్, ఫోర్‌మెన్‌లకు ఇచ్చే పండుగ బోనస్‌లు రూ. 3700 నుంచి రూ. 4 వేలు వరకు పెరిగినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి నూకరాజు తెలిపారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూగా పిలుచుకునే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే వేల సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు గంటల తరబడి నిలిచిపోయాయి. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి వారికి తులసీ మాలంకరణ చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానానికి భక్తులు క్యూ కట్టారు. కాకినాడ జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వాహణాధికారి పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆలయ భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజే రూ.4,06,917 ఆదాయం వచ్చినట్లు ఈఓ పులి నారాయణ మూర్తి తెలిపారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు చెప్పారు.

ఏటిగట్టు రోడ్డుపై రాకపోకల పునరుద్ధరణ

- ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశాలతో చర్యలు తీసుకున్న అధికారులు
- ముళ్లకంచెలు, మెష్ తొలగింపు

సాక్షి ఇంపాక్ట్



వేములవాడ ఏటిగట్టు రోడ్డుపై వేసిన ముళ్లకంచె, ఇనుప మెష్‌ను తొలగిస్తున్న సిబ్బంది

కరప: ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో వేములవాడ ఏటిగట్టురోడ్డుపై రాకపోకలను శనివారం పునరుద్ధరించారు. వేములవాడ నుంచి తుల్యభాగ డ్రెయిన్ వెంబడి ఉండే ఏటిగట్టురోడ్డు గొర్రిపూడి మీదుగా తాళ్లరేవు మండలాన్ని అనసంధానం చేస్తుంది. ఈ రహదారిలో కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై ఎన్టీఆర్ వారధిపేరిట వంతెన నిర్మించేందుకు టీడీపీ హయాంలో పనులు ప్రారంభించారు. వంతెన నిర్మాణానికి అప్రోచ్‌రోడ్డు వేయడానికి ముగ్గురు రైతుల నుంచి నాలుగు ఎకరాలను కాంట్రాక్టర్ లీజుకు తీసుకున్నాడు. నాలుగేళ్లుగా లీజు చెల్లించకపోవడంతో సదరు రైతులు అప్రోచ్‌రోడ్డులో మూడుచోట్ల ఇనుప మెష్, ముళ్లకంచెలతో మూసేశారు. దీంతో ప్రజల రాకపోకలు ఇబ్బందిగా మారాయి. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో శనివారం 'వేములవాడ ఏటిగట్టురోడ్డు బంద్' శీర్షికన కథనం వెలువడింది. దీనిపై ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి రైతులతో మాట్లాడి, రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశించారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కరప ఎస్‌ఐ నాదు రామకృష్ణ, ఏఎస్‌ఐ జి.ప్రసన్నకుమార్ శనివారం ముళ్లకంచెలు వేసిన అప్రోచ్‌రోడ్డు వద్దకు వెళ్లి రైతులతో చర్చించారు. ఎకరాకు ఏడాదికి రూ.లక్ష ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుని ఆనక ఇవ్వలేదని వారు అధికారులకు వివరించారు. ఒప్పంద పత్రాలు తీసుకువస్తే, కాంట్రాక్టర్‌తో మాట్లాడతామని, రోడ్డుకు అడ్డుగా వేసిన ముళ్లకంచెలు, ఇనుప మెష్‌ను తొలగించాలన్నారు. సోమవారం అగ్రిమెంట్ పేపర్లు తీసుకువస్తామని తెలిపి, అడ్డుగా వేసిన కంచెను తొలగించారు. దీంతో ఏటిగట్టురోడ్డుపై రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.

వెంకన్నకు యజ్ఞోపవీతం, నక్షత్రహారతి సమర్పణ



స్వామివారికి నక్షత్రహారతితో మంగళహారతి ఇస్తున్న అర్చకుడు

కరప: మండలం యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి వార్లకు శనివారం భక్తులు కాకర్లపూడి కృష్ణంరాజు, ఉమ దంపతులు వెండి యజ్ఞోపవీతం, రఘురామ కృష్ణంరాజు, రుక్మిణి కుటుంబ సభ్యులు కాశీ నుంచి తీసుకొచ్చిన నక్షత్రహారతిని సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం స్వామివారికి యజ్ఞోపవీతం అలంకరించి, అనంతరం నక్షత్రహారతితో స్వామి వారికి మంగళహారతి ఇచ్చారు.

సిరిపురంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు

కరప: మండలం సిరిపురంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమై ప్రత్యేక పారిశుధ్యపనులు నిర్వహించారు. శనివారం ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావు, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, సర్పంచ్ నున్న సుజాత, వైఎస్సార్ సీపీ నాయకుడు నున్న వీరబాబు తదితరులు అప్రమత్తమై గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామ వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో పాజిటివ్‌కేస్ నమోదైన ఇంటి పరిసర ప్రాంతాల్లో సోడియం హైపోక్లోరైట్ పిచికారీ చేయించారు. వీధులను శుభ్రంచేసి, బ్లీచింగ్ చల్లారు. గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉందని, జ్వరం కేసులేమీ రాలేదని అధికారులు తెలిపారు.